క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సతీశ్

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన గంప వెంకటరమణ అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. పోయిన ఫోన్‌ను గుర్తించి శుక్రవారం బాధితుడు వెంకటరమణకు అందజేసినట్లు ఎస్సై సీహెచ్ సతీశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నట్టయితే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే ఫోన్ గుర్తించే అవకాశముందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పేర్కొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న గంగాధర్

రాయికల్: పట్టణానికి చెందిన సంధ్య అనే నిరుపేద యువతి వివాహానికి శుక్రవారం విశ్వశాంతి పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ రూ.10 వేల ఆర్థికసాయం అందించి సేవ దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మచ్చ గంగాధర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కడకుంట్ల జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తాండ్రాలలో మద్యం పట్టివేత

కథలాపూర్: మండలంలోని తాండ్రాలలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని ఆవుల మధు వద్ద రూ. 14 వేలు విలువగల మద్యం బాటిళ్లు కనిపించడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఏఐఎంఐఎం యూత్ అధ్యక్షుడి రాజీనామా

కోరుట్ల: పట్టణానికి చెందిన ఏఐఎంఐఎం యూత్ పట్టణ అధ్యక్షుడు అబుబాకర్ సిద్దిఖీ శుక్రవారం పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత కొన్నేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం ఎంతో శ్రమించినప్పటికీ తనకు ఎలాంటి గుర్తింపు ఇవ్వటం లేదన్నారు. అందుకే పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. తనకు ఇంత కాలం సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ మోటార్లు చోరీ.. రైతుల ఆందోళన

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో మూడు రోజులుగా గుర్తుతెలియని దొంగలు విద్యుత్ మోటార్లు చోరీ చేస్తున్నారు. గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ బావులకు బిగించుకున్న 8 మోటార్లను మూడు రోజులుగా గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

పారిశుధ్య పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ శుక్రవారం పరిశీలించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రెయినేజీల శుభ్రంతో పాటు, చెట్ల పొదలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అపరిచితుల సంచారం

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేట లో అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురు మహిళలను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. వారిని ప్రశ్నిరచగా సరైన సమాదానం చెప్పకపోవడంతో ఇంకోసారి గ్రామంలోకి రావొద్దని మందలించి పంపించారు.

క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేయాలి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, వేదికపై ఎమ్మెల్యే రమేశ్‌బాబు, అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి
- చల్మెడను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ క్యాడర్ క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేయాలని, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు నివాసంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, మండల, గ్రామశాఖ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న వేములవాడలో సీఎం బహిరంగ సభను విజయవంతం చేసేందుకు అన్ని స్థాయిల క్యాడర్ జన సమీకరణ బాధ్యతలను తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబుల సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనుల జరిగాయనీ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మాజీ ఎంపీపీ

చందుర్తి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు అభ్యర్థి చల్మెడ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కోనరావుపేటలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

బొట్టుపెట్టి ఓటు అడిగి..

బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చల్మెడ సతీమణి సునీల శుక్రవారం వేములవాడలో ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, పార్టీ మహిళలు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

జెడ్పీ చైర్‌పర్సన్ ప్రచారం

కోనరావుపేట: మండలంలోని కోనరావుపేట, సుద్దాల, కనగర్తి, మామిడిపల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోకల రేఖ, ఎంపీటీసీ చారి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, చల్మెడ మధుసూదన్‌రావు, కొక్కుల నర్సయ్య, రాజు, మాజీ ఎంపీటీసీ కులేరు రవి, కులేరు శ్రీనివాస్, పోకల సంతోష్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు. న్యాయవాదుల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకే ఇస్తున్నామని ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, న్యాయవాది తంగళ్లపల్లి వెంకట్ అన్నారు. న్యాయవాదులు కర్రోల్ల శంకర్, లక్కం కిషోర్, బర్ల శ్రీనివాస్, అక్కెనపల్లి అజయ్, అక్కెనపల్లి ప్రశాంత్, వెంకట్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

- మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని మొక్కట్రావుపేట, ముత్తునూర్, రాంనూర్, చెగ్యాం గ్రామాల్లో ప్రజాఆశీర్వాద యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ చీకటి రోజులేనని, మూడు గంటల కరెంట్ కావాలో మూడు పంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. గత 40 ఏళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి రావడానికి మోసపూరిత హామీలు ఇస్తుందని, కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మరని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉన్నా

- ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



స్తంభంపల్లి గ్రామస్తులతో లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: ఇరవై ఏళ్లగా గెలిచినా ఓడినా ప్రజలతోనే ఉన్నానని, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉన్నానని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని స్తంభంపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. స్తంభంపల్లిలో ఇథనాల్ పరిశ్రమ రద్దుకోసం పోరాటం చేశానని, తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, మురళి, గెల్లు శేఖర్, బొప్పు తిరుపతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రావుపేటలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి రమేశ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

బుగ్గారం: ఒక్కసారి తనను ఆదరించి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని చందయ్యపల్లి, చిన్నాపూర్, గోపులాపూర్, వెల్గొండ, బీరుసాని గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రఘుపతి కాంగ్రెస్‌లో చేరారు. ధర్మారంలో లక్ష్మణ్‌కుమార్ నిర్వహించిన ప్రచారంలో బీఆర్‌ఎస్ నేత తిరుపతిరావు పార్టీలో చేశారు.

ఒక్కసారి అవకాశమివ్వండి

- చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం



ప్రచారం చేస్తున్న సత్యం

మల్యాల: చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూ పదేళ్లుగా ప్రజల మధ్యే ఉంటున్నానని, ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశమివ్వాలని కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కోరారు. నూకపల్లి, రామన్నపేట, బల్వంతాపూర్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇంటింటా అమలు చేస్తామని, తెలంగాణ ఉద్యమకారుడిగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి అయిన తనకు అవకాశమివ్వాలన్నారు. ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, శోభారాణి, ఆదిరెడ్డి, మారంపల్లి లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్, జలం, నర్సింహారెడ్డి, మిడ్డి శ్రీను, నేరెళ్ల సతీశ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్‌విండో వైస్ చైర్మన్

రామడుగు: కొక్కెరకుంట సింగిల్‌విండో వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు సుద్దగోని రాజు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థి మేడిపల్లి సత్యం కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ వైస్ చైర్మన్ శంకరయ్య, డైరెక్టర్లు రాజు, లక్ష్మి, మల్లయ్య, నారాయణ, మల్లేశం, రాజు, నాగేంద్ర, మధుసూదన్ పార్టీలో చేరారు. నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేందుకు అవకాశమివ్వండి

- వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



కోనరావుపేట: మామిడిపల్లిలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట/కథలాపూర్: వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్, కథలాపూర్ మండలం సిరికొండ, కథలాపూర్, గంభీర్‌పూర్, తాండ్రాల, ఇప్పపెల్లి, పోతారం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టసుఖాల్లో ప్రజల మధ్య ఉన్న తనను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోనరావుపేట మండలం కోనసీమగా మారుస్తామని, సిరికొండ–తక్కళ్లపెల్లి బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని చెప్పి ఒక పని చేయలేదన్నారు. ఇక్కడి ప్రజల సమస్యలను గాలికి వదిలేసి విదేశాల్లో విలాసాల్లో మునిగితేలారని మండిపడ్డారు. కథలాపూర్ మండలంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించకుండా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కాలయాపన చేసి మోసం చేశారని, ఇటువంటి బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ అరుణ, ఉపసర్పంచ్ రాంరెడ్డి పాల్గొన్నారు.



కథలాపూర్: సిరికొండలో ఓటు అభ్యర్థిస్తున్న ఆది

ఆదికి రూ.1.75 లక్షల ఆర్థికసాయం

వేములవాడరూరల్: వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు వేములవాడ రూరల్‌మండలం లింగంపల్లి గ్రామస్తులు రూ. 1.75 లక్షల నగదు అందజేసి మద్దతు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



బీర్‌పూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సారంగాపూర్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు నష్టపోతున్నారని, ప్రజలు చైతన్యవంతులు కావాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్, భారత్ బచావో సంస్థల నాయకులు అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ శాంతిస్తూపం చౌరస్తాలో కరపత్రాలు ఆవిష్కరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజలపై ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం, అవినీతి, విద్య, వైద్యం అందకపోవడం, నిరుద్యోగం, మద్యంతో ప్రజలు నష్టపోతున్నారని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి

మెట్‌పల్లి: ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందజేయాలని మాజీ సింగిల్ విండో చైర్మన్ అల్లూరి మహేందర్‌రెడ్డి శుక్రవారం కోరారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తున్నారన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం సబ్సిడీపై అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


పశువుల కొట్టం కాదు.. ఆర్టీసీ బస్టాండ్!



జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌ను పశువులు ఆవాసంగా మార్చుకున్నాయి. పశువులు రోజుల తరబడి అక్కడే ఉంటున్న పశువుల పేడ, మూత్రంతో బస్టాండ్ పరిసరాలు కంపుకొడుతున్నాయి. దీంతో బస్సెక్కేందుకు వచ్చే ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు బెదిరిపోయిన సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సు చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిన ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు వేచి ఉంటే బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌ను పరిశుభ్రంగా మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చిత్ర కథ

ఆహ్లాదం.. అందనంత దూరం..!



వెల్లుల పల్లె ప్రకృతివనంలో పాడైన షెడ్డు

మెట్‌పల్లిరూరల్: గ్రామాల్లో పచ్చదనంతో పాటు ఆహ్లాదకర వాతవరణం కల్పించేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు నిరూపయోగంగా మారాయి. మెట్‌పల్లి మండలం వెల్లులలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం అధ్వానంగా మారింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డు పాడైపోయింది. వనమంతా ఎండిపోయిన ఆకులతో నిండిపోయి అపరిశుభ్రంగా మారింది. అక్కడక్కడ వనంలోని చెట్లను నరికివేశారు. అంతేకాకుండా బెంచీలు దుమ్ము,ధూళితో నిండుకుని కూర్చోవడానికి వీలులేకుండా తయారైంది. మరోవైపు గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో ప్రజలు సైతం పెద్దగా ఆసక్తి చూపడంలేదు.

వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



మాట్లాడుతున్న వికాస్‌రావు, ప్రచారరథంపై డాక్టర్ దీప, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



నాగారంలో ప్రచారం చేస్తున్న వికాస్‌రావు సోదరి వినయ

వేములవాడ/వేములవాడఅర్బన్: వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి, తిప్పాపూర్‌లో 11, 24వ వార్డులో శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్ అన్నారం ఉమారాణి, డాక్టర్ దీప పాల్గొన్నారు. గత పాలకులెవ్వరూ వేములవాడ అభివృద్ధిని పట్టించుకోలేదని, ఇప్పుడేమో తాను దత్తత తీసుకుంటానని చెప్పడం సిగ్గుచేటన్నారు. నాంపల్లిలో గతంలో నిరుపేదలకు ఇచ్చిన భూములను ప్రభుత్వం తిరిగి తీసుకుందని అన్నారు. వేములవాడ ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే నాయకుడికి పట్టం కట్టాలని ఆయన కోరారు.

అడ్వకేట్లతో సమావేశం

వేములవాడ బార్ అసోసియేషన్‌లో శుక్రవారం అడ్వకేట్లతో వికాస్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించి మద్దతు ఇవ్వాలని కోరారు.

అన్న కోసం చెల్లెలు ప్రచారం

కోనరావుపేట: మండలం నాగారంలో వికాస్‌రావు తరపున ప్రచారం చేసేందుకు అమెరికాలో నివాసముంటున్న ఆయన సోదరి వెన్నమనేని వినయ, బావ శ్రీధర్‌రావు, కోడలు రియాలు వచ్చారు.

బీజేపీలో చేరిక

కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన రెడ్డి సంఘం అధ్యక్షుడు కస్తూరి సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు చల్ల వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కస్తూరి రణధీర్‌రెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు సీహెచ్ విద్యాసాగర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

ఇంటింటి ప్రచారం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, దుంపేట, తాండ్రాల గ్రామాల్లో వికాస్‌రావుకు మద్దతుగా జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్మల వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం కార్యక్రమం నిర్వహించారు.

ఇంటి వద్దనే ఓటు అవకాశం



ఇబ్రహీంపట్నం: ఓటు వినియోగించుకుంటున్న వృద్ధుడు,



వెల్గటూర్‌లో ఓటేసిన వృద్ధుడు

పెగడపల్లి: పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేని 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు భారత ఎన్నికల సంఘం ఇంటి ఈ సారి నుంచే ఓటు వేసేందుకు అవకాశం కల్పించిన విషయం విదితమే. పెగడపల్లి మండలంలో మొత్తం ఇలాంటి వారు 80 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శుక్రవారం మండలంలో ఆరు బృందాలు పర్యటించి వారి ఇళ్ల వద్దకెళ్లి ఓట్లు వేయించారు. 80 ఓట్లకు గానూ ఒకరు మృతి చెందగా, 79 మంది ఓట్లు ఇంటి నుంచి సేకరించినట్లు అధికారులు తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో వయోవృద్ధుడు అబ్బూరి శంకర్ ఇంటి వద్దకు ఎన్నికల అధికారులు వెళ్లి బ్యాలెట్ పేపర్‌ను ఇచ్చి ఓటు వేయించారు. ఆయన వేసిన బ్యాలెట్ పత్రాన్ని కవర్‌లో వేసి ఎన్నికల అధికారులు సీల్ చేశారు. కోరుట్ల నియోజకవర్గంలో 383 మంది వయోవృద్ధులను గుర్తించగా, ఇబ్రహీంపట్నం మండలంలో 93 మంది ఉన్నారు. వీరి వద్దకు ఎన్నికల అధికారులు వెళ్లి ఓటు హక్కు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

సారంగాపూర్: పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి ఇంటివద్ద కల్పించిన ఓటు హక్కు కల్పించిన వారు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 100 శాతం వినియోగించుకున్నారు. బీర్‌పూర్ మండలంలో 21 మంది వృద్ధులు, దివ్యాంగులు 6 గురు, సారంగాపూర్‌లో 24 మంది దివ్యాంగులు, 19 మంది వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వెల్గటూర్: మండలంలో ఎన్నికల అధికారులు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయడానికి ఇబ్బంది పడే వృద్ధులు, వికలాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఇంటివద్దే ఓటు అవకాశం కల్పించారు. శుక్రవారం అధికారులు వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి వారితో ఓటు వేయించారు. శుక్ర, శని వారాల్లో ఈ కార్యక్రమం జరగనుండగా, దీనికోసం అధికారులు ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు.

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో సీనియర్ సిటిజన్స్, వికలాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి 99 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ ఖయ్యూం శుక్రవారం తెలిపారు. ఇందులో 81 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

'మాస్టర్‌ప్లాన్ కత్తి ఇంకా వేలాడుతూనే ఉంది'



మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణం సమీప గ్రామాలపై మాస్టర్‌ప్లాన్ కత్తి ఇంకా వేలాడుతూనే ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట, హస్నాబాద్, రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జగిత్యాల మున్సిపాలిటి మాస్టర్‌ప్లాన్ నుంచి గ్రామాలను తొలగిస్తామన్నారు.

రాయికల్: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి చేస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్‌లో శుక్రవారం మైనార్టీ నాయకులను కలిసి చెయ్యి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.